క్లుప్తంగా

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కోవెలకుంట్ల: స్థానిక చైల్డ్‌ఫండ్ ఇండియా ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో మంగళవారం విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఆ సంస్థ దత్తత గ్రామాలైన ముదిగేడు, కమలపురి, బిజనవేముల, అమడాల గ్రామాలకు చెందిన 9 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఎస్‌ఐ మౌలానీ అధ్వర్యంలో సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ కోఆర్డినేటర్ ఖాదర్‌బాష, సిబ్బంది మహేష్, చెన్నయ్య, ఉసేని పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

కొలిమిగుండ్ల: గ్రామాల్లోనే ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. చింతలాయిపల్లె గ్రామ సచివాలయంలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో కొత్తగా ఆధార్ కోసం నమోదు చేసుకున్న వారికి పత్రాలను ఆయన అందజేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గ్రామ సచివాలయాల పరిధిలోనే ప్రతి నెలా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తుందన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

అవుకు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఉదయం 10 గంటలకు సిబ్బంది ఆఫీసులోని కరెంటు స్విచ్‌లను ఆన్ చేయగానే అక్కడ ఉన్న 230 వాల్ట్స్ కెపాసిటీ ఇన్వర్టర్‌లో పొగలు చెలరేగి ఒక్కసారిగా బ్లాస్ట్ అయ్యింది. ప్రధాన మీటర్ బోర్డు కూడా కాలిపోయింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే వైర్ కనెక్షన్లు తొలగించారు. సిబ్బంది అప్రమత్తం కాకపోయి ఉంటే మంటలు చెలరేగి కార్యాలయంలోని రికార్డులు మొత్తం కాలిపోయే ప్రమాదం ఉండేది. సంఘటనపై డిప్యూటీ తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మూలంగా ఇన్వర్టర్, మూడు కంప్యూటర్స్, ప్రింటర్స్ తదితర వస్తువులు కాలిపోయాయన్నారు. విషయాన్ని ఉన్నతాధికారులతోపాటు ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య దృష్టికి తీసుకెళ్లామన్నారు.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కొలిమిగుండ్ల: ప్రభుత్వం అందించే వివిధ రకాల సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం బి ఉప్పలూరు రైతు భరోసా కేంద్రంలో హనుమంతుగుండం గ్రామానికి చెందిన శ్రీబాలాజీ రైతు గ్రూపునకు 40 శాతం సబ్సిడీతో ట్రాక్టర్, రోటవేటర్, గుంటిక, రివర్సిబుల్ నాగలి, ఏడు, తొమ్మిది మడకల నాగళ్లు అందించారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, రైతు మిత్ర సభ్యులు రామిరెడ్డి, కొండారెడ్డి, సుబ్బరాయుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పేరు తేవాలి

కొలిమిగుండ్ల: జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్రానికి పేరు తేవాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నరేష్, దస్తగిరి ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 27నుంచి 30 వరకు అస్సాంలోని గౌహతిలో జరుగనున్న సబ్ జూనియర్ బాలుర జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడనున్నారు. ఈ మేరకు మంగళవారం జెడ్పీ చైర్మన్ ఆ విద్యార్థులను అభినందించారు. ఖర్చుల నిమిత్తం తనవంతుగా జెడ్పీ చైర్మన్ వారికి రూ.10వేలు అందజేశారు.

మెరుగైన సేవలు అందించాలి

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చే సామాన్య రోగులకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శేషారెడ్డి సీహెచ్‌సీలో ట్యూబెక్టమీ ఆపరేషన్లు ప్రారంభించిన మూడు నెలలలోనే 52 ఆపరేషన్లు నిర్వహించి ఉమ్మడి జిల్లాలోని 17 సీహెచ్‌సీలో శేషారెడ్డి సీహెచ్‌సీ ఏగ్రేడ్‌కు చేరుకుంది. మంగళవారం సీహెచ్‌సీలో డ్రాయింగ్ అధికారి సాగరిక ఆధ్వర్యంలో ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, వైద్యులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మద్దిలేటి స్వామి చైర్మన్ రామ చంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు అజాం బాషా, మధు సూదన్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ

బనగానపల్లె: మండలంలోని యాగంటిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు రామపుల్లారెడ్డి తన తండ్రి దివంగత కడపయ్య గారి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం రూ. 10, 600 విలువ క్రీడాదుస్తులను విద్యార్థులకు మంగళవారం హెచ్‌ఎం అనితజీవన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ మేరకు రామపుల్లారెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలు పూలమాలవేసి అభినందించారు.

రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

బనగానపల్లెరూరల్: జగనన్న భూ రక్ష పథకం కింద ప్రభుత్వం పటిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డోన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ సర్వేయర్స్ (డీఐఎస్) చంద్రశేఖర్, సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక పాదుపు భవనంలో అవుకు, కోవెలకుంట్ల, బనగానపల్లె మండలాలకు చెందిన సర్వేయర్లు, వీఆర్‌ఓలకు రీ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీ సర్వేకు చేపట్టాల్సిన జాగ్రత్తలను వారు వివరించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల తహసీల్దార్ పుష్పకుమారి, బనగానపల్లె ఆర్‌ఐ రాఘవేంద్ర ప్రసాద్, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



విద్యార్థినులకు రాగిజావ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. జగనన్నగోరుముద్ద కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న రాగిజావ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు స్వయగా రాగిజావ పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ స్వరూప అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు తీసుకొచ్చిందన్నారు. జగనన్న గోరుముద్ద పథకం పేరుతో మంచి పోషకాలు, రుచికరమైన ఆహారం అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థును మరింత ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు వారానికి మూడు రోజులు రాగిజావ పంపిణీకి సీఎం శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేదని, ఆ భోజనం తినలేక విద్యార్థులు చాలా ఇబ్బంది పడ్డారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణమ్మ,ఎంపీడీఓ శివరామయ్య, సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐ రామిరెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్‌రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

- **డోన్ టౌన్:** విద్యార్థుల ఆరోగ్యం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి మధ్యాహ్న భోజనంలో పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నారని రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అన్నారు. స్థానిక పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆయన మంగళవారం గోరుముద్దలో నూతనంగా రాగిజావ అందించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పురుగులు,ఉడికి ఉడకని అన్నం పెడుతుండగా విద్యార్థులు తినలేక ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా నాణ్యమైన ఆహారాన్ని రోజుకు ఒక రకం చొప్పున అందిస్తున్నామన్నారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రారంభించారు.
- **కోవెలకుంట్ల:** జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ అందించే కార్యక్రమాన్ని మంగళవారం సంజామల ప్రభుత్వ పాఠశాలల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డిప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ సక్రు నాయక్, హెచ్‌ఎం నాగరాజు, ప్రసాదు పాల్గొన్నారు.
- **ప్యాపిలి:** స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈఓ శ్రీనివాసులుతో కలసి జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పోషకాహారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయనిర్మల పాల్గొన్నారు.
- **బేతంచెర్ల:** మండల పరిధిలోని గూటుపల్లె జెడ్పీ హైస్కూలు, గోరుమానుకొండ, గోర్లగుట్ట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల్లో హెచ్‌ఎంలు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగి జావను అందించారు. ఆయా కార్యక్రమాల్లో గోరుమానుకొండ, గూటుపల్లె సర్పంచ్‌లు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **అవుకు:** స్థానిక ఎస్సీ పాఠశాలలో మంగళవారం ఎంఈఓ శ్రీధర్ రావు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రమేష్, రామలక్ష్మి, హబీబా ఉపాధ్యాయులు శివరంగయ్య, సీఆర్‌పీలు బాషా, శ్రీను, రామ్మోహన్, ఓబులేసు సచివాలయ సిబ్బంది రాము, అమిరూన్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



విద్యార్థినులకు రాగిజావ అందజేస్తున్న పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలనే తలంపుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కొనియాడారు. జగగన్న గోరు ముద్ద కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన రాగి జావ పంపిణీ చేశారు. ప్రతిభ గల విద్యార్థులు ఆర్థిక స్థోమత లేక విదేశాల్లో ఎంబీబీఎస్ చదువుకోలేని వారికి నేనున్నానంటూ విదేశీ విద్యాదీవెన పథకం రూపంలో అభయం ఇచ్చారన్నారు. విదేశాల్లో టాప్ 100 ర్యాకింగ్ గల యూనివర్శిటిల్లో సీటు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.25 కోట్లు ఫీజు చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమశేఖర్, తెలుగు పండిట్ వైవీఎస్ నారాయణరెడ్డి, పేరెంట్స్ కమి టీ అధ్యక్షుడు గువ్వల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నెరవేరిన దశాబ్దాల కల

- పాలిటెక్నిక్ కళాశాల మంజూరుపై వెల్లువెత్తిన హర్షాతిరేకాలు
- సీఎం చిత్ర పటానికి పాలభిషేకం



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: బేతంచెర్ల మండలంలో పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడంతో దశబ్దాల విద్యార్థుల కళనెరవేరింది. దీంతో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాతబస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా పేల్చి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు డోన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నారని గుర్తు చేశారు. అందులో భాగంగా బేతంచెర్ల మండలంలోని గోరుమానుకొండ మోడల్ స్కూలు వద్ద పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి రూ.36 కోట్ల నిధులు మంజూరు చేయడం శుభపరిణామం అన్నారు. పాలిటెక్నిక్ కళాశాల సమీపాన రూ. 36 కోట్లతో బీసీ బాలుర రెసిడెన్సియల్ స్కూలు, సుమారు 9. కోట్లతో ఐటీఐ కళాశాల, ఎంఎస్‌ఎమ్ టూల్ డిజైనింగ్ ఇనిస్టిట్యూట్ నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరక్టర్ మురళీ కృష్ణ, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, నాగ వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రెడ్డి, దస్తగిరి, శేఖరయ్య, శేఖర్‌రెడ్డి, బుగ్గన కుమార్ రెడ్డి, ఖాజా, సలీమ్, బీరవోలు నాగేశ్వర్‌రెడ్డి, సంథానీ, తిరుమలేశ్వర్‌రెడ్డి, యాకోబ్, అజాంబాషా, ఎద్దులన్న, సత్యం, కిరణ్, నిరంజన్, హరి,గోరుమానుకొండ, రంగాపురం సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, గుమ్మగాలరాజు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ

డోన్ టౌన్: బకాయి ఆస్తి పన్ను ఈ నెల 31లోపు చెల్లిస్తే అపరాధ రుసం పూర్తిగా మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం పట్టణంలోని వివిధ సచివాలయాల పరిధిలో చేపట్టిన పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ నెల 31లో పన్ను చెల్లించి అపరాధ రుసుం మాఫీకి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. 1వ సచివాలయం అడ్మిన్ లక్ష్మినారాయణరెడ్డి ఆస్తి పన్నుల వసూళ్లపై సారించిన ప్రత్యేక దృష్టిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

వేలంపాట వాయిదా

డోన్ టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం పట్టణ పరిధిలో దినసరి, వారం సంతకు సంబంధించి నిర్వహించిన వేలం పాటలు వాయిదా పడ్డాయి. ఎవ్వరూ రానందున వాయిదా వేశామని కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన జి.సౌజన్య తన భర్త వేధింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి మంగళవారం తెలిపారు. పలుకూరు గ్రామానికి చెందిన మద్దయ్య కూతురు సౌజన్యను జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు వెంకటేష్‌తో 10 నెలల క్రితం వివాహం అయింది. అయితే కొన్ని నెలల నుంచి తన భర్త వెంకటేష్ తను అదనపు కట్నం తీసుకురావాలని తండ్రి వెంకట రమణ, తల్లి రమణమ్మ, ఆడపడుచుతో కలిసి వేధింపుల పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేసిందన్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తగ్గిన ఆదాయం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచా యతీ పరిధిలో ఆర్థిక సంవత్సరానికి వివిధ పన్నుల నిర్వహణకు నిర్వహించిన వేలాల్లో గత ఏడాదితో పోలిస్తే ఆదాయం తగ్గింది. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట జరిగింది. సంత మార్కెట్‌లో రుసుం వసూలు వేలాన్ని పట్టణానికి చెందిన నూర్ అహమ్మద్ రూ. 2.53 లక్షలకు దక్కించుకున్నాడు. దిన మార్కెట్‌ను వెంకటేశ్వర్లు రూ. 8.01 లక్షలకు, కమేశాను ఫజుల్ రహిమాన్ రూ. 7,200 దక్కించుకున్నారు. గతేదాడితో పోలిస్తే రూ. 71 వేలు ఆదాయం తగ్గింది. కార్యక్రమంలో ఈఓ బాలాంజనేయులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులపై వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆసుపత్రుల పునరుద్ధరణలో భాగంగా స్థానిక 50 పడకల కమ్యునిటీ వైద్యశాలను ప్రభుత్వం వంద పడకల స్థాయికి పెంచిందని గుర్తు చేశారు. రూ.22 కోట్లతో నిర్మిస్తున్న పట్టణంలోని వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై కాంట్రాక్టర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి భవన నిర్మాణ పనులు తుది మెరుగులు దిద్దుకుంటుందని, మూడు అంతస్తులతో సుందరంగా నిర్మాణం అవుతుందన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా రోగులకు అన్నివైద్య సౌకర్యాలు లభిస్తాయన్నారు. ఏప్రిల్ చివరినాటికి ఆసుపత్రికి చేరాల్సిన పరికరాలు పూర్తిస్థాయిలో వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ శిరిషా, సివిల్ సర్జన్ డాక్టర్ సుజాత, ఎంపీడీఓ శివరామయ్య, కంట్రాక్టర్ మహేశ్వరరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డిరామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్ జాహెద్, బండి బ్రహ్మానంద రెడ్డి, కంబగిరి, రామసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, కాటసాని రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులకు సహకరించాలి

బనగానపల్లె: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి జీఎం టాకీస్ వరకు రూ.4 కోట్లతో చేపట్టిన రోడ్డు వెడల్పు పనులను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సంబంధింత అధికారులతో కలిసి పరిశీలించారు.రోడ్డుకు ఇరువైపు ఉన్న అక్రమణలను అక్రమణదారులు ఇప్పటికే కొందరు స్వచ్ఛందంగా తొలగించుకోగ ఎమ్మెల్యే కాటసాని వారిని అభినందించారు. ఇంకా ఉన్న అక్రమణాలను వారే స్వచ్ఛందంగా తొలగించు కొని అభివృద్ధి పనులకు సహకరించాలని ఆయన కోరారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధుని కరించాలని పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ నాగశ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్ రెడ్డిని ఎమ్మెల్యే కాటసాని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టామని, అయితే కొందరు అసత్య ప్రచారాలతో పాటు ప్రచార మాద్యమాల్లో తప్పుడు వార్తలను పెడుతున్నారని అసహనం వ్యక్తం చేవారు. అనంతరం ఎస్సీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఇక్కడ నెలకొన్న డ్రైనేజీ సమస్య ఉన్నందున ప్రతిపాదనాలు తయారు చేయాలని పీఆర్ డీఈఈ నాగ శ్రీనివాసులను ఎమ్మెల్యే కాటసాని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అత్తార్‌జాహెద్, బండి బ్రహ్మానందరెడ్డి, శంకర్‌రెడ్డి. రామసుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాటసానికి సన్మానం

వైఎస్సార్‌సీపీ బలపరచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి విజయం సాధించడంపై పట్టణంలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కలిసి దుశ్శాలువేసి ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిని విజయానికి సహకరించిన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యావాదలు తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం కమిటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కమల్‌తేజారెడ్డి, రవితేజారెడ్డి, రామసుబ్బారెడ్డి, తిమ్మారెడ్డి, భూపాల్‌రెడ్డి, హుస్సేన్‌బేగ్, నారాయణ స్వామి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల స్థలం పరిశీలన

బేతంచెర్ల: మండలానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని మంగళవారం తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, మంత్రి బుగ్గన రాజేంద్రరెడ్డి ఓఎస్డీ ప్రతాప్ రెడ్డి, సర్వేయర్ అన్నారావు పరిశీలించారు. గోరుమానుకొండ గ్రామ సమీపాన కర్నూలు ప్రధాన రహదారి పక్కన్న బుగ్గానిపల్లె రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 811లో 3.50 ఎకరాలు కేటాయించినట్లు తహసీల్దార్ చెప్పారు.